# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పేదలకు నాణ్యమైన వైద్య విద్యను, వైద్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **తెలంగాణలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వెల్లడించారు.**

3. **ఆంధ్రప్రదేశ్ లో సినిమా టికెట్ ధరల పెంపుపై నూతన విధానాన్ని రూపొందిస్తామని సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

4. **ఆరావళి పర్వత శ్రేణి పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ స్పష్టం చేశారు**

5. **యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ పండుగ జరుపుకుంటున్నారు.**

=========================

పేదలకు నాణ్యమైన వైద్య విద్యను, వైద్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం పీపీపీ విధానం అమల్లో ఉందని.. పేద ప్రజలకు, కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఈ విధానం ఉపయోగ పడుతుందన్నారు.పీపీపీ విధానం ద్వారా వైద్య కళాశాలలు, ఆసుపత్రుల వంటి కీలక ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతం కావడమే కాకుండా, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ లో పీపీపీ విధానం ద్వారా చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

-------------------------

వేగవంతమైన పాలన విధానాలతో పౌరులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై సంబంధిత అధికారులతో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న

సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనా మిషన్ లో భాగంగా పీ4 విధానాన్ని ముందుకు తీసుకెళ్లటంతో పాటు వాటి అమలును పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర కోసం రూపొందించిన పది సూత్రాలను పది మిషన్లుగా నిర్దేశించుకుని పనిచేయాలని సూచించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేయాలన్నారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో ఉంచాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

తెలంగాణలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. నారాయణపేట జిల్లా కోస్గిలో జరిగిన కొడంగల్ నియోజకవర్గ సర్పంచుల సమ్మేళనం, సన్మాన కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 8 మండలాల సర్పంచులు, వార్డు సభ్యులను సన్మానించారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, రాష్ట్రంలోని పెద్ద పంచాయతీలకు 10 లక్షలు, చిన్న పంచాయతీలకు 5 లక్షల రూపాయల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధులను కేటాయిస్తామని వెల్లడించారు. కొడంగల్‌ను పెద్ద పారిశ్రామికవాడగా అభివృద్ధి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తూ దేశానికి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో సినిమా టికెట్ ధరలపై పెంపుపై నూతన విధానాన్ని రూపొందిస్తామని సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సినిమా టికెట్టు ధరల హేతుబద్ధీకరణపై ఏర్పాటైన కమిటీ అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న సమావేశమైంది. సమావేశం అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ...

వాయిస్ 28 సెకన్లు

---------------------------

విశాఖపట్నంలోని రుషికొండ భవనాలను ఆతిథ్యం రంగానికి వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. విశాఖలోని రుషికొండభవనాల వినియోగంపై ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘం నిన్న సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, పర్యాటక శాఖ కార్యదర్శి పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ 30సెకన్లు

---------------------------

యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ పండుగ జరుపుకుంటున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనల నిర్వహిస్తున్నారు. ఏసుక్రీస్తు జనన సందేశాన్ని తెలియజేసే నక్షత్రాన్ని రంగుల కాగితాలతో తయారు చేసి ఇళ్ళ ముందు అలంకరించారు. ఇతరుల పాపాలను ప్రక్షాళన చేసేందుకు తన ప్రాణాలను పణంగా పెట్టిన ఏసుక్రీస్తు కు ప్రతీకగా భావించే క్రిస్మస్ చెట్టును ఇళ్ళ ముందు ఏర్పాటు చేసుకొన్నారు.

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ ,ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల గవర్నర్లు ఎస్ అబ్దుల్ నజీర్, జిష్ణు దేవ్ వర్మ, ముఖ్య మంత్రులు ఎన్. చంద్రబాబు నాయుడు,

ఎ. రేవంత్ రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై. ఎస్. జగన్ మోహన రెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజలలో ఐక్యత, శాంతిని పెంపొందించడానికి క్రిస్మస్ పండుగ మనకు స్ఫూర్తి నిస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తన శుభాకాంక్షల సందేశంలో పేర్కొన్నారు.

క్రిస్మస్ నేపథ్యంలో  పాస్టర్లకు గౌరవ వేతనం కింద  ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 8,418 మంది పాస్టర్లకు 50.50 కోట్ల రూపాయలను ను విడుదల చేసింది.

---------------------------

ఆరావళి పర్వత శ్రేణి పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అన్నారు. ఆకాశవాణికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మంత్రి  మాట్లాడుతూ, కొన్ని రాజకీయ పార్టీలు, ఆరావళి పర్వతాలకు  సంబంధించిన సుప్రీంకోర్టు తీర్పుపై అవాస్తవాలు  ప్రచారాన్ని చేస్తున్నాయని అన్నారు. వారు ఉద్దేశపూర్వకంగా సుప్రీంకోర్టు తీర్పును వక్రీకరించి రాజకీయ సాధనంగా వాడుకుంటున్నారని  అన్నారు. ఆరావళి ప్రాంతంలో అక్రమ మైనింగ్‌ను నిషేధించడమే సుప్రీంకోర్టు తీర్పు  ముఖ్య ఉద్దేశమని  కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతులకు ఆధునిక యంత్రాలను  రాయితీతో అందించే వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని   జనవరిలో పునఃప్రారంభిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ లోని రాష్ట్ర  సచివాలయంలో వ్యవసాయ శాఖ పురోగతిపై మంత్రి నిన్న  ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,  యాసంగిలో సాగవుతున్న పంట భూములను ఉపగ్రహ చిత్రాల  ద్వారా గుర్తించి.. రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని  అధికారులను ఆదేశించారు . కేంద్ర ప్రభుత్వ యాంత్రీకరణ పథకానికి రాష్ట్ర వాటా నిధులను కేటాయించి  తద్వారా రైతులకు రాయితీపై యంత్రాలు, పరికరాలు అందజేస్తామని మంత్రి స్పష్టంచేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతుంది. ఎజెన్సీతో పాటు ఇతర ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తోంది. పలు జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 4 డిగ్రీల నుంచి 15 డిగ్రీలలోపు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్లోని అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 3.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవగా.. తెలంగాణాలోని సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ లో   6.4  డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 26వ తేదీ వరకు పంపవచ్చు.

====================